వర్షం కురిసిన రాత్రి!

• ముంపు ప్రాంతాల్లోని ఇళ్లలో చేరిన వర్షపునీరు • ఇబ్బందులు పడ్డ బస్తీవాసులు


కారులో చిక్కుకున్న వారిని కాపాడుతున్న యువకులు


గాంధీనగర్‌డివిజన్ అరుంధతినగర్‌లో ఇళ్లలోకి వచ్చిన వర్షపునీరు

ముషీరాబాద్/చిక్కడపల్లి: పార్శిగుట్ట చౌరస్తా సమీపంలోని ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వెనుక వీధిలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదనీటిలో కారు సగం వరకు మునిగిపోయింది. కారు నీటిలో తేలియాడుతూ ముందుకు వెళ్లడాన్ని స్థానికులు గమనించారు. కారు అద్దాలు పగులగొట్టి అందులో ఉన్న ఐదుగురిని బయటకు తీశారు. అదే విధంగా గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్‌లో ఇళ్లలోకి వర్షపునీరు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మ్యాన్‌హోళ్లు తీసి వరదనీరు వెళ్లేలా స్థానికులు కృషి చేశారు.

బదిలీల రగడ?

మూడు రోజులుగా వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు, అధికారుల ఆందోళన

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల రగడ కొనసాగుతుంది. ఇటీవల డ్రైవర్ల ఆందోళనలతో అట్టుడికిన తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల ప్రధాన కార్యాలయం గత మూడు రోజులుగా బదిలీల అంశంపై ఉద్యోగులు, అధికారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. 18 నెలలుగా డ్రైవర్లకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు జీతాలు ఇవ్వకపోవడంతో వారం రోజుల క్రితం వందలాది మంది డ్రైవర్లు ఆందోళనకు దిగారు. దీంతో సగం వరకు డ్రైవర్ల జీతాలను వాణిజ్య పన్నుల శాఖ జారీ చేసింది. కాగా రెండు మూడు రోజులుగా బదిలీలు జరుగుతాయని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. ఏసీటీఓ, డీసీటీఓ, సీటీఓలతో పాటు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది లోలోనా ఆందోళన పడుతు కాలం గడుపుతున్నారు. జీఓ 317 ఏర్పాటు అయినా ఇంతవరకు ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు పూర్తికాలేదు.

పది నెలలకే బదిలీలు ఎలా?

గత సంవత్సరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖలో ఎన్నడూ లేని విధంగా కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు బదిలీలు చేపట్టింది. బదిలీలు జరిగి సరిగ్గా పది నెలలు కాకపోయినా తిరిగి ఎలా బదిలీలు చేస్తారని అధికారులు, సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. జీఓ ఎంఎస్ నెంబర్:317 ప్రకారం.. బదిలీలు చేసినచో ఉద్యోగులను, అధికారులను, సిబ్బందిని కనీసం మూడేళ్ల సర్వీస్ పూర్తయితేనే బదిలీలు చేయాలని నిబంధన ఉంది. జోనల్ వ్యవస్థ ఏర్పడినా ఇంత వరకు సర్వీస్ రూల్స్ మాత్రం ఖరారు కాలేదు. సర్వీస్ రూల్స్ లేకుండా బదిలీలు ఎలా చేస్తారని పలువురు వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. జోనల్ వ్యవస్థ తర్వాత తుది సీనియార్టీ జాబితా సిద్ధం కాకపోవడంతో తాత్కాలిత జాబితాలో బదిలీలు చేయడం దారుణమన్నారు. గత సంవత్సరం దాదాపు 100 శాతం ఏసీటీఓ క్యాడర్లకు బదిలీలు చేసినప్పటికి తిరిగి ఎలా వేస్తారని పలు డివిజన్లలోని అధికారులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

రెవెన్యూ వసూళ్లపై ప్రభావం..

సర్కిల్ కార్యాలయాల పరిధిల్లో వాణిజ్య పన్ను ల శాఖ (జీఎస్‌టీ) రెవెన్యూ వసూళ్లపై తీవ్రంగా బదిలీల ప్రభావం పడనుంది. 3 నుంచి 5 సంవత్సరాలు అధికారులు కానీ, సిబ్బంది కానీ ఒకే ప్రాంతంలో పనిచేస్తే రెవెన్యూ వసూళ్లు పెద్ద ఎత్తున జరుగుతాయి. అప్పుడే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. వాణిజ్య పన్నుల శాఖ లో పదోన్నతులు కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వానికి ఇలా పెండింగ్ ఉండడంతో అధికార యంత్రాంగం అంతా ఆందోళన పడుతున్నారు. మార్గదర్శకాలతో బదిలీ లు చేస్తే వాణిజ్య పన్నుల శాఖ ఆర్థిక పథంలో పయనిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

బదిలీల ప్రక్రియ నిలిపివేయండి..

వాణిజ్య పన్నుల శాఖలో బదిలీల ప్రక్రియను నిలిపి వేయాలని పలువురు అధికారులు, సిబ్బంది కోరుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించిన తర్వాతనే బదిలీల ప్రక్రియ చేపట్టాలంటున్నారు. పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, ఇతర దీర్ఘకాల సమస్యలన్ని ముందుగా పరిష్కరించిన తర్వాత బదిలీల ప్రక్రియ చేపట్టాలంటున్నారు. కనీసం రెండు నుంచి మూడు సంవత్సరాలు సర్వీసు పూర్తయిన తర్వాతనే బదిలీల ప్రక్రియ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది మనోవేదనకు గురై పనులు ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు బదిలీల ప్రక్రియను నిలిపివేసి ముందుగా రెవెన్యూ వసూళ్లు, ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టిస్ట్ యూనియన్ కార్యాలయ భవనానికి స్థలం కేటాయించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. యూనియన్‌ను నమ్ముకున్న కళాకారులకు సరైన పారితోషకం లభించేలా కృషి చేయాలన్నారు. పేద కళాకారులకు రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్, ఈఎస్ఐ, సౌకర్యాలను కల్పించడంతో పాటు యూనియన్ కార్యాలయ శాశ్వత భవనానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి బి.నూకరాజు, ఆల్ కమిటీస్ చైర్మన్ నందూరి రాము, జాయింట్ సెక్రటరీ కె.రాంమోహన్, వర్కింగ్ మహిళా అధ్యక్షురాలు ఆశా, వైస్ ప్రెసిడెంట్స్ డి.పద్మరేఖ, శ్రీనివాస్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్‌కు సన్మానం


చైర్మన్ సాయికిరణ్‌ను సన్మానిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

ముషీరాబాద్: తెలంగాణ మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికిరణ్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌కు చెందిన గంగపుత్ర సంఘం భవన చైర్మన్ కేఎం సాయి, సంఘం నాయకులు రాకేష్, శివ, రాఘవేందర్ తదితరులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ముగిసిన చేనేత వస్త్ర ప్రదర్శన

కాచిగూడ: వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో నారాయణగూడ పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన ఆదివారం రాత్రి ముగిసింది. ఈ నెల 12వ తేదీన శుక్రవారం ప్రారంభమైన చేనేత వస్త్ర ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. చేనేత వస్త్రాలు 'కొనుగోలు చేద్దాం... నేత వృత్తిని కాపాడుకుందాం'అనే నినాదంతో చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ... చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా నేత డాక్టర్ సమత, గుంటక రూప, పోరండ్ల శారథ, ఎల్.సంధ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ హాస్టల్‌ను పునః ప్రారంభించాలి


కాచిగూడ హాస్టల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు

కాచిగూడ: కాచిగూడలోని సాంఘిక సంక్షేమ విద్యార్థుల హాస్టల్ ఐదేళ్లుగా మూతబడి ఉందని.. దానిని వెంటనే పునః ప్రారంభించాలని హాస్టల్ పూర్వవిద్యార్థి రుద్రవరం లింగస్వామి డిమాండ్ చేశారు. కాచిగూడ హాస్టల్ రి-ఓపెన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం హాస్టల్ భవనం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ అని తెలిపారు. హాస్టల్‌ను మూసేసి షెడ్యూల్ కులాల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సాకులతో కాచిగూడ హాస్టల్‌ను మూసేశారన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ముందుకొచ్చి హాస్టల్‌ను వెంటనే పునః ప్రారంభించాలన్నారు. నిరసనలో బోయిన శ్రీనివాస్, గిరి, బొమ్మెర రామూర్తి, సంగమేశ్వర్, కిరణ్, చారి, జగదీష్, రాము గోవింద్, భూషపాక గణేష్, రమేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పాపం పసివాడు!

తప్పిపోయిన బాలుడిని చేరదీసిన పోలీసులు



ముషీరాబాద్/చిక్కడపల్లి: ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్ గంగపుత్ర కాలనీ సమీపంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వద్ద సుమారు రెండేళ్ల బాలుడు ఏడుస్తూ కనిపించాడు. వెంటనే స్థానికులు ముషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రస్తుతం బాలుడు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడు. ఈ బాలుడిని గుర్తిస్తే ముషీరాబాద్ ఠాణాలో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కోరారు.

శాకంబరి అలంకరణ.. అంబర్‌పేట మాంకాలమ్మ



మహాంకాళి ఆలయంలో జరిగిన పూజాల్లో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

అంబర్‌పేట: మహాంకాళి అమ్మవారు ఆదివారం శాకంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం బోనాల వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయాన్ని కురగాయాలు పచ్చని చెట్ల కొమ్మలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై. శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, బి.మల్లికార్జున్‌గౌడ్, కిశోర్, సుధాకర్, శ్రీధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ రియాజ్‌కు సన్మానం

కాచిగూడ: తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రియాజ్‌ను విమలక్క, దూసరి రాజుగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. రియాజ్‌ను శాలువాతో సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం


మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం బాపునగర్‌లోని ప్రగతి విద్యానికేతన్‌లో ఆగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌తో కలిసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ లక్ష్యం


ఇందిరానగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న గండి కృష్ణమాదిగ, నాయకులు

ముషీరాబాద్: మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటం చేస్తోందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గండి కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం భోలక్పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా ఆరోగ్యశ్రీ, పెన్షనర్ల పెంపు, ఉద్యోగ ప్రమోషన్లు, అనాథ పిల్లల హక్కుల సాధన తదితర పథకాలను సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్‌మాదిగ, నాయకులు ఎల్లయ్య, రోషన్ విజయ్‌రావు, జగదీష్, రాజు, జంగయ్య, బాలకృష్ణ, నందగిరి నర్సింహ్మా, కె.ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మను సంస్కృతి రాజ్యాంగ వ్యవస్థకు వ్యతిరేకం

డీబీపీ జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్



కాచిగూడ: విద్యాసంస్థల్లో మను సంస్కృతిని అమలు చేయాలని మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ)జాతీయ అధ్యక్షుడు వడ్లమూడి కృష్ణ స్వరూప్ అన్నారు. న్యాయ విద్య చదువుతున్న విద్యార్థులకు మను సంస్కృతి బోధించాలనే ప్రతిపాదనను ఢిల్లీ యూనివర్సిటీ వ్యతిరేకించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. మను సంస్కృతి రాజ్యాంగ వ్యవస్థకు వ్యతిరేకమన్నారు.

పోలీసు పహారాలో అశోక్‌నగర్ పరిసరాలు


అశోక్‌నగర్ చౌరస్తాలో వాహనాలతో మోహరించిన పోలీసులు

చిక్కడపల్లి: గ్రూప్-2, 3 పోస్టులు పెంచి, పరీక్షలను వాయిదా వేయాలని శనివారం రాత్రి నిరుద్యోగ అభ్యర్థులు చేపట్టిన ధర్నా ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. నిరుద్యోగులు ఆదివారం సైతం ధర్నా చేసే అవకాశం ఉండటంతో పోలీసులు అశోక్‌నగర్ పరిసర ప్రాంతాలలో భారీగా మోహరించారు. దీంతో పాటు చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు ప్రాంతాలలో పోలీసులు నిఘా పెట్టారు. బుక్ స్టాల్స్, టీస్టాల్స్‌ను అభ్యర్థులు గుమిగూడకుండా త్వరగా మూయించారు. ఈ బందోబస్తులో సైఫాబాద్ సీఐ నరేష్, చిక్కడపల్లి ఎస్సైలు నాగరాజు, అభిషేక్, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

రాజ్యసభ ఎంపీ డా. కే.లక్ష్మణ్


దివ్యాంగులకు వీల్ చైర్స్, ఊతకర్రలు పంపిణీ చేస్తున్న ఎంపీ డా. కె.లక్ష్మణ్, కొల్లి నాగేశ్వర్‌రావు

చిక్కడపల్లి: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోవా లక్ష్మణ్ అన్నారు. ది కాస్మోపాలిటన్ ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను ఆదివారం నిర్వహించారు. త్యాగరాయ గానసభలో ప్రముఖ వైద్యుడు డా. వేంకటేశ్వర్‌రావుకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వీల్ చైర్స్, అంధులకు ఊతకర్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు, అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, వ్యవస్థాపక కార్యదర్శి ఉదయగిరి గోపాలకృష్ణమూర్తి, చెంచయ్య, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను ఉపయోగించుకోవాలి


అల్పాహారం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

చిక్కడపల్లి: లయన్స్‌క్లబ్ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని వీనస్ వ్యాక్సిన్ ఎండీ, ప్రముఖ సంఘసేవకులు రఘునాథ్ ప్రదీప్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీఆంజనేయస్వామి దేవాలయం వద్ద 250మందికి అల్పాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ జీకే రమణ, జాట్ నగర అధ్యక్షుడు అఖిలేష్, లయన్స్ క్లబ్ సభ్యులు శివకుమార్, ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్, సాంబశివరావు, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కాచిగూడ: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నాగల్ల పోచయ్య ఇశ్రాయేల్ డిమాండ్ చేశారు. ఆగస్టు 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి చర్చి ఎదుట నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చి చట్టబద్ధత కల్పిస్తామని గతంలో ఎన్డీఏ కన్వీనర్‌గా పనిచేసిన చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినా నెరవేర్చలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో దక్షిణ తెలంగాణ కన్వీనర్ ఎంవీ జాన్సన్, ప్రధాన కార్యదర్శి బొమ్మగల్ల కిష్టయ్య, ఉమా తెలిపారు.

కరాటే బెల్టు, సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్

కాచిగూడ: పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలంటే కరాటేలో దర్ఫీదు ఇప్పించాలని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్, ఇన్‌స్ట్రక్టర్ రాపోలు సుదర్శన్ అన్నారు. కాచిగూడలోని హెల్త్ లీగ్‌లో ఆదివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ఉత్తీర్ణులైన 18 మంది విద్యార్థులకు ఆయన కరాటే కలర్ బెల్టులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాంతి స్వరూప్ లేలే, కృష్ణ, దామోదర్, కరాటే విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.1000కోట్ల వసూళ్లు.. అభిమానుల సంబురాలు



చిక్కడపల్లి: తెలుగు సినిమా కల్కి సినిమా రూ.1000 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిడంతో హీరో ప్రభాస్ అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. కృష్ణరాజు, ప్రభాస్ అభిమానుల సంఘం అధ్యక్షుడు చక్రం, థియేటర్ మేనేజర్ నాగరాజు మాట్లాడుతూ... సింగిల్ స్క్రీన్ థియేటర్‌లో 10రోజుల్లో రూ.కోటి వసూలు చేసి సినిమా చరిత్ర సృష్టించిందని తెలిపారు.

పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి: ప్రముఖ రచయిత్రి శైలజామిత్ర రచించిన 'వష్టి కథ సంపుటి'పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత సయ్యద్ సలీం ముఖ్యఅతిథిగా సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు ప్రముఖులు అత్తలూరి విజయలక్ష్మి, కస్తూరి అలివేణి, సరస్వతి, జానకిదేవి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.


వష్టి కథ సంపుటిని ఆవిష్కరిస్తున్న సయ్యద్‌సలీం, విజయలక్ష్మి

నియోజకవర్గ అమ్మవారి ఆలయాలకు రూ.50.38లక్షలు

కాంగ్రెస్ నేత కృష్ణగౌడ్



అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో బోనాల వేడుకలు వైభవంగా జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50.38 లక్షల అందించి చేయూతనిచ్చిందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ అన్నారు. నియోజకవర్గంలో 128 అమ్మవారి ఆలయాలకు చెక్కులను పంపిణీ చేశామని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా బోనాల పండుగకు ముందే ఆలయాలకు అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాం కలగకుండా నియోజకవర్గంలో బోనాల పండుగను నిర్వహించుకుంటామని పేర్కొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కను నాటుతున్న కార్పొరేటర్ ఎ.పావనీ

చిక్కడపల్లి: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అందరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని కోరారు. ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ సమన్వయకర్త వినయ్‌కుమార్ నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మపేరిట జనప్రియ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులతో కలసి ఆమె మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మల్లేష్, చంద్రకళ, సుధ, మురళి, రామకృష్ణ, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముట్టుకుంటే షాకే.!

ప్రాణసంకటంగా మారిన విద్యుత్ స్తంభాలు


గుల్షన్‌నగర్‌లో షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభం

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్ నగర్, తాజీర్‌నగర్‌లోని విద్యుత్ స్తంభాలు 15 రోజులుగా షాక్ కొడుతోంది. స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇటీవల విద్యుదాఘాతంలో 2 మేకలు మృతి చెందాయని స్థానికుడు అక్లక్ హుస్సేన్ తెలిపారు. ఇది గమనించి తామే విద్యుత్ స్తంభం చుట్టు చెక్కలతో కంచె ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైశ్యులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి


సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా

ముషీరాబాద్: ప్రపంచ వ్యాపగా ఉన్న వైశ్యులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. రాంనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ ముషీరాబాద్ నియోజకవర్గం నూతన కార్యాలయాన్ని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆదివారం నియోజకవర్గ అధ్యక్షుడు వీరేందర్‌గుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. అనంతరం వారాహి మాతకు పూజలు నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహిన్‌గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, మంజుల, రాంనగర్ సీతార తదితరులు పాల్గొన్నారు.

బాకారం ధర్మచరణ సమితికి ఫర్నిచర్ అందజేత



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని బాకారం ధర్మచరణ సమితికి ప్రముఖ సంఘ సేవకుడు, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పులి సందీప్‌గౌడ్ 150 కుర్చీలు, ఇతర ఫర్నిచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బాకారం బస్తీ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ధర్మచరణ సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలో స్థానికులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, మహేష్‌కుమార్, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కొత్తగా రిజిస్టరైన ఆలయాలకు బోనాల సాయం అందించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేస్తున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట: కొత్తగా దేవాదాయ శాఖలో నమోదైన ఆలయాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి ఈ విషయంలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అంబర్‌పేట డివిజన్‌లోని పేరొందిన అమ్మవారి ఆలయాల పేర్లను దేవాదాయ శాఖలో నమోదు చేశామని తెలిపారు. ఆయా అమ్మవారి ఆలయాల అభివృద్ధి, బోనాల పండగను వైభవంగా నిర్వహించుకునేందుకు ఆర్థిక సహాయం ఇచ్చేలా చూడాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్ ముదిరాజ్ రత్నపాండే, రంగు ఉదయ్‌గౌడ్, వినయ్ తదితరులు ఉన్నారు.